క్లుప్తంగా

మంత్రి పొన్నంకు సన్మానం

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్ నుంచి వేములవాడ వెళ్తున్న రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఆదివారం మండలంలోని నీలోజిపల్లి బస్టాండ్ వద్ద కొద్దిసేపు ఆగారు. కాంగ్రెస్ బీసీసెల్ అధ్యక్షుడు కూస రవీందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సన్మానించారు.

మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి పొన్నంతో మండల నాయకులు

ముస్తాబాద్: మండల కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను వేములవాడలో కలిశారు. మండలంలో పెండింగ్ పనులపై మంత్రితో చర్చించామని మండలశాఖ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. మాజీ సర్పంచ్ వొరగంటి తిరుపతి, డీసీసీ ఉపాధ్యక్షుడు బుర్రరాములు, డీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తలారి నర్సింలు తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

తంగళ్లపల్లి: మండలంలోని గండిలచ్చపేట గ్రామంలో ఆదివారం సీఎస్‌సీ హెల్త్ కేర్ లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నీరటి లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి పైతరి వెన్నెల, బీఆర్ఎస్ నాయకులు నీరటి బాబు, జిల్లా కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప ఆలయంలో పూజలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం కేరళ స్వామివారి సన్నిధానంలో మాదిరిగానే మకర విళక్కు పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, గణపతిపూజ, సుబ్రహ్మణ్యపూజ, పరివారదేవత పూజ, స్వామివారికి అష్టాభిషేకం, మంగళహారతి పూజలు నిర్వహిస్తున్నట్లు గురుస్వామి శ్రీని వాస్ ఆదివారం తెలిపారు. సాయంత్రం తిరువాభరణపూజ, ఆభరణాల ఊరేగింపు, తిరువాభరణాల అలంకరణ, మకరజ్యోతి దర్శనం తదితర పూజలు నిర్వహించనున్నట్లు గురుస్వామి వివరించారు.

వంతెన పనులు ప్రారంభం

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్ల–నిమ్మపల్లి గ్రామాల మధ్య మూలవాగుపై వంతెన పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూలవాగుపై రాకపోకలకు ఇబ్బందులు పడుతుండటంతో గతంలో ఆది శ్రీనివాస్ కృషితో కాజ్‌వే నిర్మించారు. కొన్నేళ్లుగా వరదకు కొట్టుకుపోయి రవాణాకు ఇరుగ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తాత్కాలిక మరమ్మతులు చేయడం, వర్షాలకు కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. అప్పటి నుంచి కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మించాలని కోరగా ఇటీవల రూ.14 కోట్లు మంజూరయ్యాయి. నిధులు మంజూరు చేయించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సర్పంచ్ స్వప్న దేవరాజ్, ఉపసర్పంచ్ పుంగం గౌడ్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర



అల్మాస్‌పూర్‌లో ఇంటింటా అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌లో అయోధ్య రాములోరి అక్షింతలతో గ్రామస్తులు శోభాయాత్ర నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ అక్షింతలు పంపిణీ చేశారు. ఎంపీపీ రేణుక, సర్పంచ్ రాధారపు పుష్పల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగిలో..

రుద్రంగి: మండలకేంద్రంలో శ్రీ రామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి వేడుకలు

వేములవాడరూరల్: భోగి పండుగను ఆదివారం వేములవాడ మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి ఆవుపేడతో గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. పిల్లలకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు పతంగులను ఎగురవేసి ఆనందంగా గడిపారు.

దారిచూపని బోర్డులు

- గ్రామాల్లో కానరాని సూచిక బోర్డులు
- కొన్ని గ్రామాల్లో తుప్పపట్టి నిరుపయోగంగా..
- దారి తెలియక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



కిష్టంపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేయని సూచిక బోర్డు

చందుర్తి : ప్రయాణికుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేస్తున్న సూచిక బోర్డులు తుప్పు పట్టి పోతున్నాయి. ఏళ్ల తరబడి వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో బోర్డులు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. మండల పరిధిలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డుల్లో కొన్ని తుప్పు పట్టి పోతుండగా, మరికొన్ని రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్లపొదల్లో ఉండి కనిపించడం లేదు. దీంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రయాణికులు అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు.

తప్పుని తిప్పలు

మండల పరిధిలోని వేములవాడ –కోరుట్ల ప్రధాన రహదారి అయిన మూడపల్లి– అనంతపల్లి, మర్రిగడ్డ –చందుర్తి గ్రామాల మధ్య జోగాపూర్ రోడ్డు, జోగాపూర్–రామారావుపల్లె వద్ద కిష్టంపేట రోడ్డు, చందుర్తి నుంచి రామన్నపేట, మర్రిగడ్డ గ్రామాలకు వెళ్లే రోడ్ల మధ్య ఆర్‌అండ్‌బీ అధికారులు 15ఏళ్ల క్రితం సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు సూచిక బోర్డులకు రంగులు వేసి గ్రామాల పేర్లు రాయించిన దాఖలాలు లేవు. దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు సూచిన బోర్డులు కానరాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో దారి తప్పి ఇతర గ్రామాలకు వెళ్తున్నారు. ముఖ్య కూడళ్లలోని బోర్డులు నాలుగైదు ఏళ్ల క్రితమే రంగుపోయి తుప్పుపట్టాయి. వీటికి మరమ్మతు చేపట్టాలని మండలసభలో ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. రోడ్డుపక్కన పాఠశాలల గేట్ల వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను కూడా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో పాఠశాల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో గ్రామస్తులు రోడ్డుపై మట్టికుప్పలు పోసి తాత్కాలిక స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసుకున్నారు.

మలుపుల వద్ద ఇదే దుస్థితి

మండలంలోని మూడపల్లి నుంచి లింగంపేట వరకు 16కు పైగా మూలమలుపులున్నాయి. ఏ ఒక్క మూలమలుపు వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో తరుచూ మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి రామన్న వరకు. మర్రిగడ్డ ఎక్స్‌రోడ్డు నుంచి సనుగుల, హన్మాజీపేట ఎక్స్ రోడ్డు నుంచి ఎన్గల్, బండపల్లి, బావుసాయిపేట గ్రామాల వరకు గల మూలమలుపుల వద్ద ఎక్కడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

బోర్డులు ఏర్పాటు చేయాలి



మర్రిగడ్డ ఎక్స్‌రోడ్డు నుంచి సనుగుల వరకు ఉన్న పాత బోర్డులను సరిచేస్తే సరిపోతుంది. కొన్ని బోర్డులు కింద పడిపోగా, మరికొన్ని తుప్పు పడుతున్నాయి. వాటికి రంగులు వేసి గ్రామాల పేర్లు రాస్తే సరిపోతుంది. ఆర్‌అండ్‌బీ శాఖకు ఆదాయం మిగులుతుంది. వెంటనే అధికారులు మరమ్మతు చేపట్టాలి.

– బొడిగె అనిల్‌గౌడ్, మర్రిగడ్డ

తరచూ ప్రమాదాలు



ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిధిలో రోడ్లపై సూచికబోర్డులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు, ఈ రోడ్డుపై కొత్తవారు వెళ్తే తికమకపడుతున్నారు. వాహనదారులకు దగ్గరికి వచ్చేంత మూలమలుపు కనపడక తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

– లింగంపల్లి బాబు, బండపల్లి

ప్రతిపాదనలు పంపాం



గ్రామాల్లో మూలమలుపులు, ముఖ్య కూడళ్లు, ఎక్స్‌రోడ్లు, పాఠశాల గేట్ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే అన్నిగ్రామాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తాం. నిధులు లేకపోవడంతోనే ఏర్పాటులో జాప్యం జరుగుతోంది.

– సతీశ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, చందుర్తి

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



బోయినపల్లి: బహుమతులు అందిస్తున్న సర్పంచ్

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో దొడ్డ మౌనిక (ప్రథమ), సోలుపాటి సమత (ద్వితీయ), మోకాళ్ల స్వాతి (తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. అధిక పాల ఉత్పత్తి చేసి పాడి రైతులు మారుపాక రాజయ్య ప్రథమ, పోగుల మల్లయ్య ద్వితీయ, ఎల్లె ప్రభాకర్‌కు తృతీయ బహుమతులను డెయిరీ అధ్యక్షుడు జిల్లెల్ల లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ దేవరాజు అందజేశారు. కార్యక్రమంలో రూట్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు అనుపాటి భూంరెడ్డి, రావులపెల్లి మహిపాల్‌రెడ్డి, జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, ఏరెడ్డి వెంకట్‌రెడ్డి, న్యాయ నిర్ణేతలు కోచకంటి అనిత, ప్ర ణతి, పాలఉత్పత్తిదారులు, మహిళలు పాల్గొన్నారు.

గుండన్నపల్లిలో..

బోయినపల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా గుండన్నపల్లిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొప్పుల లక్ష్మి, ఎంపీటీసీ అక్కెనపెల్లి ఉపేందర్, నాయకులు స్వామి, మల్లేశం, రాధ అంజయ్య, ఉపసర్పంచ్ తదితరులున్నారు.

అడవిపదిరలో..

వీర్నపల్లి: మండలంలోని అడవిపదిరలో శ్రీ షిరిడీ సాయి సీతారామాంజనేయ భక్త బృందం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 30 మంది మహిళలు, యువతులు పాల్గొనగా మొదటి బహుమతి నీలం నవ్య గ్రూప్, ద్వితీయ బహుమతి పని స్పందన గ్రూప్ అందుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల లక్ష్మీరాజం, తిప్పవరం భాస్కర్, మడుపు తిరుపతిరెడ్డి, శివరామకృష్ణ, బాదిరెడ్డి రాజు, మణిపాల లావణ్య, పంబాల మాధవి, తదితరులు పాల్గొన్నారు.



వీర్నపల్లి: ముగ్గులు వేస్తున్న యువతులు

నియామకం



శ్రీధర్ రావును సన్మానిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా ఆదివారం వెన్నమనేని శ్రీధర్ రావు నియామకమయ్యారు. ఈ మేరకు బీజేపీ అధ్యక్షుడు జిల్లా ప్రతాప రామకృష్ణ నియామకపత్రం అందజేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, సీనియర్ నాయకులు రేగులపాటి సుభాశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శ్రీధర్ రావును బీజేవైఎం మండల అధ్యక్షుడు కోల ఆంజనేయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సందవేని రాజు యాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నపేటలో శ్రమదానం



రోడ్లను శుభ్రం చేస్తున్న వలంటీర్లు, నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేటలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా ఆదివారం వలంటీర్లు గ్రామంలోని రోడ్లు శుభ్రంచేశారు. రోడ్లపై పేరుకుపోయిన మట్టిని తొలగించి, శుభ్రం చేశారు. గ్రామంలోని వివిధ కాలనీల్లోని చెత్తను, ముళ్లపొదలను తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్క శంకర్, ఉపసర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేని పర్శరాములు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం నాయకులు రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. కరీంనగర్‌లో పొన్నం కలిసిన ఉపాధ్యాయులు అనంతరం సిరిసిల్లలో మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. పదోన్నతులకు టెట్ నిబంధన ఎత్తివేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్ష హరికృష్ణ, సంఘం బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు



బహుమతులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామీణ ప్రాంత క్రీడాకారులు అవకాశాలను వినియోగించుకొని క్రీడల్లో సత్తా చాటాలని, క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సర్పంచ్ దాసరి సుజాత అన్నారు. మండలంలోని రాగట్లపల్లిలో మండలస్థాయి వాలీబాల్ పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో సిరికొండ రమేశ్ ప్రథమ బహుమతి, నవీన్ టీమ్ ద్వితీయ బహుమతులు సాధించారు. విజేత జట్టుకు రూ.వెయ్యి, రన్నరప్ జట్టుకు రూ.500 నగదు అందించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, సతీశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా జెడ్పీటీసీ పూర్మాని మంజుల రాంలింగారెడ్డి ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ టోని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విజేతలకు రూ.5 వేలు, రన్నరప్ టీమ్‌కు రూ.2,500 నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాంలింగా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మునిగెల రాజు, భరత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పడితే ప్రమాదమే..

వీర్నపల్లి: మండలకేంద్రం నుంచి ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధాన రహదారి పక్కనే ఎండిన భారీ వృక్షం ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు ఎవరి మీద పడుతుందోనని రహదారి వెంట వెళ్లే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని నెలలుగా చెట్టు నుంచి కొమ్మలు విరిగి కిందపడుతున్నాయి. ప్రధాన రహదారి పక్కన ఉన్న వృక్షాన్ని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



వైభవంగా గోదాదేవి కల్యాణం



వేములవాడఅర్బన్: నాంపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



బోయినపల్లి: నర్సింగాపూర్‌లో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ముస్తాబాద్ : మద్దికుంటలో..



ఎల్లారెడ్డిపేట : కల్యాణానికి హాజరైన భక్తులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ హనుమాన్ ఆలయం, వేములవాడ రాజన్న అనుబంధ ఆలయమైన నాంపల్లి గుట్టపై లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి నరేందర్, ఆలయ అర్చకులు రాచకొండ విజయ నరసింహచార్య, హర్షవర్ధన్, రామకృష్ణచార్య, తదితరులున్నారు.

బోయినపల్లి: మండలంలోని తడగొండ శ్రీ వేంకటేశ్వర స్వామి, నర్సింగాపూర్ రామాలయాల్లో గోదా రంగనాథుల కల్యాణం ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించారు. స్వామి వారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నాడి రా జ్యలక్ష్మి, చిందం రమేశ్ నర్సింగాపూర్ ఆలయ నిర్వాహకులు జోగినపల్లి జితేందర్‌రావు, జోగినపల్లి అజిత్‌రావు, అర్చకులు గోపికృష్ణ ఆచార్య, వెంకటాచార్య, వంశీకృష్ణ ఆచార్య, కల్వకుంట్ల మోహనకృష్ణ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్, పోతుగల్, మద్దికుంట గ్రామాల్లో గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించారు. సర్పంచ్‌లు సుమతి, గౌతంరావు, సింగిల్‌విండో చైర్మన్ బాపురావు, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్సాని దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్ శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయం ఆధ్వర్యంలో గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించారు. అర్చకులు వేణుగోపాలచారి, నవీన్‌చారి, శివశాస్త్రీ కల్యాణం జరిపించారు. అంతకుముందు సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి శివాలయంలోని కల్యాణ మండపం వరకు స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మి, మాజీ సర్పంచ్ నర్సయ్య, ఎంపీటీసీ అపేర సుల్తానా, ఆలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగలు పడతారు జాగ్రత్త

- వరుస సెలవులతో పలు ఇళ్లకు తాళాలు
- సొంతూళ్లకు వెళ్లిన ఉద్యోగులు
- జాగ్రత్తగా ఉండాలంటున్న పోలీసులు
- కరపత్రాలతో అవగాహన
- అనుమానితుల సమాచారం ఇవ్వాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: సంక్రాంతి పండుగకు పట్టణాల నుంచి అందరూ పల్లెలబాట పడుతున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంతోపాటు వేములవాడ పట్టణంలో అద్దె ఇళ్లలో ఉంటూ ఉద్యోగాలు, వివిధ పనులు చేసే వారు తమ సొంత ఊళ్లకు వెళ్లిపోయారు. విద్యాసంస్థలకు వరుసగా సెలవులు రావడంతో ఇంటిల్లిపాది స్వగ్రామాల బాట పట్టారు. ఇదే సమయంలో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్తున్న వారు సమీప పోలీస్‌స్టేషన్‌కు, విలేజ్ పోలీసు ఆఫీసర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

పోలీసుల సూచనలు ఇవీ..

- ★ దూరప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌ను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తెలపాలి.
- ★ ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవడం లేదా వెంట తీసుకెళ్లాలి.
- ★ ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి.
- ★ మెయిన్ డోర్‌కు తాళం వేసి వెళ్లేటప్పుడు ఆ తాళం కనిపించకుండా డోర్ కర్టెన్స్ కట్టాలి.
- ★ విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టకూడదు.
- ★ బైక్‌లు, కారులను ఆరుబయట కాకుండా ఇంటి ఆవరణలో పార్కింగ్ చేయాలి.
- ★ ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి.
- ★ విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు.
- ★ వాచ్‌మెన్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- ★ అనుమానితుల సమాచారం ఇవ్వాలి.

మత్స్యకారులను ఆదుకునేందుకు చర్యలు



మాట్లాడుతున్న రామచంద్రం

ముస్తాబాద్: మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఫిషరీస్ డెవలప్‌మెంట్ చైర్మన్ చొప్పరి రామచంద్రం అన్నారు. ఆదివారం మండలంలోని తెర్లుమద్దిలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎగువ, మధ్యమానేరు ప్రాజెక్టులతోపాటు 5 వందలకు పైగా ఉన్న చెరువుల్లో మత్స్య కార్మికులకు ఉపాధి లభిస్తుందన్నారు. సొసైటీలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పిట్ల రాంగోపాల్, సొసైటీ డైరెక్టర్ గాడిచెర్ల దేవయ్య, రాజమల్లయ్య, బాపురావు, పుట్ట చంద్రయ్య, శాడ శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



అతిథులను సత్కరిస్తున్న సాహితీ సమితి ప్రతినిధులు

సిరిసిల్లకల్చరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం సిరిసిల్ల సాహితీ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. పట్టణంలోని వస్త్ర, వ్యాపార సంఘ భవనంలో జరిగిన కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, అఖిల భారత రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం, సమితి అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య, ఏనుగుల ఎలయ్య హాజరై మాట్లాడారు. అనంతరం సమితి ప్రతినిధులు, కవులు తమ కవితల్లో పండుగ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ కవితా గానం చేశారు. అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కోడం నారాయణ, గోశికొండ మురారి, గడ్డం పరశురాం, దామోదర్, ఆడెపు లక్ష్మణ్, కొలిపాక శోభారాణి, ఈడెపు సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం జంగారెడ్డిపల్లిలో బుధవారం వరకు జరిగే శ్రీ రామలింగేశ్వరస్వామివారి జాతరలో మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సైసు ధాకర్ హెచ్చరించారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.